క్లుప్తంగా

కరాటే విజేతకు సన్మానం



పెబ్బేరు రూరల్: ఈ నెల 23న రష్యాలోని ఖజార్ హాస్టల్ నిర్వహించిన ప్రపంచ స్థాయి కరాటే పోటీలో వనపర్తి మండలంలోని చిమన గుంటపల్లి పంచాయతీ పరిధిలోని తూర్పుతం ఆడాకు చెందిన విలాసనాయక్ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి మొదటి విజేతగా నిలిచాడు. ఆదివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన నివాసంలో విలాసనాయక్ అభినందిస్తూ, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కూలీలైన తల్లితండ్రులు హీర్యానాయక్, చిట్టెమ్మ కష్టపడి కుమారుడిని చదివించారని వారిని అభినందిచారు.

పేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ



మదనాపురం: మండలంలోని దళిత క్రైస్తవులకు శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీపీ పద్మావతి ప్రభుత్వం ద్వారా అందిన నూతన దుస్తులను ఆయా గ్రామాల పాస్టర్లకు అందజేశారు.

మెగా వైద్యశిబిరం



ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైందని సర్పంచు సతీష్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని పెద్ద వారితో పాటుగా చిన్నపిల్లలకు సైతం అన్ని రకాల వ్యాధులను పరీక్షించేందుకు హెల్త్ ఫర్ ఆల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకున్నార న్నారు. సిరి చిన్నపిల్ల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాఘవేంద్రకుమార్, డాక్టర్ శరత్, అద్వయిత్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాఘవేందర్ ఆధ్వర్యంలో గ్రామంలో మొత్తం 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించామని వైద్య సిబ్బంది తెలిపారు

శతాధిక వృద్ధురాలు మృతి



పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కుర్వమ్మ (101) శతాధిక వృద్ధురాలు ఆదివారం మృతి చెందారు. కుర్వమ్మ మూడు తరాల వారసులను కళ్లారా చూసినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమె తన పనులు తాను చేసుకుంటూ కాలం వెళ్లదీసిందన్నారు. ఎలాంటి కాళ్ల, కీళ్ల నొప్పులు లేకుండా పూర్తిగా ఆరోగ్యంగా ఉండేదని వారు తెలిపారు. ఈమెకు కొడుకు, కూతురు ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్, రేమద్దుల గ్రామాల మధ్య పీఆర్ రోడ్డుపై కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుపై గుంత ఉండటంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. కల్వర్టుపై ఉన్న గుంత దగ్గరికి వచ్చే వరకు తెలియకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రయాణికులు తెలిపారు. రోడ్డుపై ప్రతి నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తున్నా కల్వర్టుపై ఉన్న గుంత కన్పించడం లేదా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రంధ్రానికి మరమ్మతు చేపట్టి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతుల ఆసక్తి

పెద్దకొత్తపల్లి: మండలంలో వాణిజ్య పంట అయిన డ్రాగన్ ఫ్రూట్ పంటపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని కల్వకోలు, చెన్నపురావుపల్లి గ్రామాల్లో రైతు కొత్త వెంకట్‌రెడ్డి ఈ పంటను సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. మొక్కలతో పాటు సిమెంట్ స్తంభాలు, డ్రిప్, సిమెంట్ చక్రాలను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో ఈ పంటకు డిమాండ్ ఉండటంతో డ్రాగన్ ఫ్రూట్‌సాగు కోసం రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలను అందజేస్తే సాగు చేస్తామంటున్నారు. ప్రభుత్వం పట్టించుకుని సబ్సిడీని ప్రకటించాలని రైతులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- నిధులు లేక నిర్మాణ దశలో నిలిచిపోయినవి ఎన్నో!
- వసతులు లేక అవస్థల పాలవుతున్న రైతులు, దివ్యాంగులు
- స్పందించని అధికారులు



ప్రారంభానికి నోచుకోక ముందే శిథిలావస్థకు చేరుకున్న ఏఈ భవనం



తూంకుంటలో పునాదులకే పరిమితమైన సింగిల్‌విండో భవనం

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన పలు భవనాలను వినియోగంలోకి తీసుకురావట్లేదు. దీంతో ప్రజలకు అసౌకర్యవంతంగా ఉండడమే కాకుండా నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అలాగే పలు గ్రామాల్లో రైతుల ప్రయోజనార్థం నిర్మించిన మరికొన్ని భవనాలు నిర్మాణ దశలోనే ఉండిపోయాయి. అవసరమైన నిధులను మంజూరు చేయించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

రూ.లక్షలు వెచ్చించి

మండల కేంద్రంలో రూ.5 లక్షలలు ఖర్చు చేసి నిర్మించిన పంచాయతీరాజ్ ఏఈ భవనం వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిర్మాణం పూర్తి చేసుకున్నా శిథిలాస్థకు చేరింది. అలాగే దివ్యాంగుల భవనం కోసం మరో రూ.5 లక్షలు ఖర్చు చేసిన అధికారులు పూర్తి స్థాయిలో భవనానికి అవసరమైన వసతులు సమకూర్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. అలాగే తూంకుంట భవనాన్ని పునాదుల వరకు నిర్మించి వదిలేయడంతో రైతులు ప్రతి ఏటా ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆవేదనలో దివ్యాంగులు

మండల కేంద్రంలో అసంపూర్తిగా వదిలేసిన దివ్యాంగుల భవనం పూర్తి చేసేందుకు మండలంలోని దివ్యాంగులంతా తమ వంతు విరాళాలు వేసుకొని కొంత భవనాన్ని పూర్తి చేశారు. అయినా కాంపౌండ్ వాల్, బండలు, కలర్ వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాన్ని వినియోగించుకోలేకపోతున్నామని, ఇప్పటికైనా నిధులు వెచ్చించి పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

దివ్యాంగులపై కనికరం చూపాలి



మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న భవనానికి అదనపు నిధులు మంజూరు చేసి అవసరమైన వసతులు కల్పించాలి. ప్రధానంగా భవనానికి మూత్రశాలలు, ర్యాంపు, బండలు వేయకపోవడంతో వినియోగించుకోలేకపోతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందించడం లేదు. అవసరమైన నిధుల మంజూరు కోసం ఆందోళనలు నిర్వహిస్తాం.

– ఎం మోహన్, రాష్ట్ర దివ్యాంగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, సంగినేనిపల్లి

విండో భవనాన్ని పూర్తి చేయాలి



మండలంలోని దాదాపు 8 గ్రామాల రైతులు ఉపయోగకరంగా ఉన్న సింగిల్ విండో భవనం పూర్తి స్థాయిలో వినియోగానికి నోచుకోలేదు. ఎన్నో ఏళ్లుగా పునాదులకే పరిమితమై దర్శనమిస్తుంది. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలి.

– కొమ్ము కుర్మయ్య, తూంకుంట

క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతాం



మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న, శిథిలావస్థకు చేరిన భవనాలపై క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతాం. అవసరమైన వాటికి నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం.

– కతలప్ప, ఎంపీడీఓ, వీపనగండ్ల

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

వనపర్తి టౌన్: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతి అందిస్తుందని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై)తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ శిక్షణలో బేసిక్ కంప్యూటర్ (డేటా ఎంట్రీ ఆపరేటర్)కు ఇంటర్మీడియట్ పాస్, అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)కి బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్‌కు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్, వీలర్ వీలర్ సర్వీసింగ్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్‌కు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్‌కు పదో తరగతి పాస్/ఐటీఐ ఉన్న వారు అర్హులని, 4నెలల శిక్షణ ఉంటుందని, ఎలక్ట్రీషియన్(డెమెస్టిక్)కు 10వ, తరగతి/ఐటీఐ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, 5నెలల కాలపరిమితితో శిక్షణ ఉంటుందన్నారు. 18–35ఏళ్లలోపు వారు, గ్రామీణ అభ్యర్థులు అర్హులని, చదువు మధ్యలో ఉన్న వారు అనర్హులు అని పేర్కొన్నారు. అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో వచ్చే నెల 2వ తేదీన ఉదయం 10 గంటలకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్, పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థలో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 నంబర్లకు సంప్రదించాలన్నారు.

గ్రామాలకు చేరిన రాములోరి అక్షంతలు



హిందూ ప్రతినిధులకు అక్షంతలు అందజేస్తున్న వీహెచ్‌పీ అధ్యక్షుడు రాములు తదితరులు

ఖిల్లాఘనపురం: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి తలంబ్రాలు ఆదివారం గ్రామాలకు చేరాయి. మండల కేంద్రంలోని బెస్తగేరి అంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం తలంబ్రాలను ఆదివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాములు, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, కమిటీ సభ్యులు విక్రం, అంజనేయులు, శ్రీను తదితరులు మండలంలోని అన్ని గ్రామాల భక్తులకు తలంబ్రాలను అందజేశారు. వారు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో తలంబ్రాలను ఉంచారు. 2024 జనవరి 1వ తేదీన ప్రజలకు తలంబ్రాలు అంజేస్తామని, అంతవరకు దేవాలయాల్లో నిత్య దీపారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు. జనవరి 22న సాయంత్రం ప్రజలు ఇళ్ల దగ్గర కనీసం 5 దీపాలు వెలిగించి పూజలు నిర్వహించుకున్న తరువాత తలంబ్రాలను తలపై చల్లుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అయోధ్యకు వెళ్లలేరని దేవాలయ ట్రస్టు వారు స్వామి వారి తలంబ్రాలను దేశంలోని ఇంటికి పంపిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రాములోరి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అందరూ మతసామరస్యంతో మెలగాలి



మాట్లాడుతున్న శ్రీరామ్

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషానికి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ ఆరోపించారు. దానికి భిన్నంగా లౌకిక శక్తులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు యువతకు మతసామరస్యం అవశ్యకతను తెలియపర్చాలని కోరారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తమ స్వార్థం రాజకీయం ప్రయోజనం కోసం గ్రామీణ ప్రాంతంలోని యువతలో దేశభక్తి, హిందూ మతం, ధర్మం పేరుతో పరమత విద్వేషాన్ని నింపుతుందని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు భారతదేశ లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. మత విద్వేషం ద్వారా శాంతి, అభివృద్ధి, వ్యక్తితం వికాసానికి అవరోధం అవుతుందని వాపోయారు. సేవా భావం ద్వారా యువతను ఆకర్షించాలని, చెడు మార్గాల వల్ల కాదన్నారు. సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ యువతలో లౌకిక భావాలు, సమాజంపై బాధ్యత, మానవత్వ విలువలను పెంచేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈనెల 26న పార్టీ 96 ఆవిర్భావ దినోత్సవం అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో బీసీలు నిర్మించుకున్న ఇళ్ల స్థలాన్ని గ్రామ కంఠంలో చేర్చాలని పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి అధికారులను కోరారు. దీంతో పాటు సర్వేనెం.576లోని ప్రజా అవసరాల నిమిత్తం వదిలిన 72వ ప్లాటు స్థలం అక్రమణకు గురైందని, అధికారులు స్పందించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సహదేవుడు, లింగయ్య, పరంధాములు, నర్సింహ, రాముడు, హరీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగించేదెవరు?



బీటీరోడ్డుపై ప్రమాదకరంగా మట్టి

గోపాల్‌పేట: మండల కేంద్రం నుంచి ఏదుట్లకు వెళ్లే దారిలో డీ–8 మేజర్–2 కాల్వ సమీపంలో ఇటీవల కృష్ణానది నుంచి నీటిని తీసుకొని శుద్ధిచేసేందుకు బీటీ రోడ్డు పక్క నుంచి గోపాల్‌పేట పంప్‌హౌస్ వరకు పైప్‌లైన్ తీశారు. పైప్‌లైన్ కోసం తీసిన మట్టిని నేరుగా బీటీరోడ్డుపై పోశారు. సుమారు ఇరవై మీటర్ల దూరం వరకు బీటీరోడ్డుపై మట్టి పోయడంతో ఎత్తు ప్రాంతం నుంచి వచ్చే వాహనదారులకు మట్టి ఉన్నట్లు గుర్తించక ఎప్పుడు ప్రమాదం బారిన పడుతారోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



దేవరపల్లిలో డ్రోన్‌తో రసాయనాల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్‌అలీ అన్నారు. ఆదివారం మండలంలోని మేడేపల్లి, దేవరపల్లి గ్రామాల్లో వికాసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్‌యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్‌భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్‌ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా ఆధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాగ్యలక్ష్మి, శివాజీ, ఏపీఎం శ్రీనివాసులు ఉన్నారు.

రేపు శ్రీదత్త జయంతి



ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని శ్రీదత్త ఆలయం వద్ద మంగళవారం శ్రీదత్త జయంతి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5.30గంటలకు సుప్రభాతం, 6గంటలకు కాగడహారతి, 6.45కు శ్రీవిఘ్నేశ్వర, శ్రీనందీశ్వర, శ్రీదత్తాత్రేయ, శ్రీసంతాన నాగదేవత, శ్రీజోతిర్లింగ, శ్రీరామ్‌పరివార్, శ్రీలక్ష్మీదేవి, శ్రీషిర్డిసాయినాథులకు పంచామృతాభిషేకం, 9గంటలకు కావిడి ఉత్సవం, అర్చన, అష్టోత్తరం, 10.30గంటలకు శ్రీ దత్తయజ్ఞం, 12గంటలకు హారతి, సాయంత్రం ధూపహారతి, సాయి భజన, పల్లకీసేవ, సేజారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే వర్తక సంఘం అధ్యక్షుడు ఏపూరి యాదగిరిశెట్టి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మైసమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్రిస్మస్ సెలవులు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరుకున్న ప్రజలు సొంత వాహనాలు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాలైన వనపర్తి, గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. 10వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారులు రంగారావు తెలియజేశారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కొల్లాపూర్: మండలంలోని మొలచింతలపల్లికి చెందిన పల్లవి 44–46 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు బాక్సింగ్ కోచ్ భాస్కర్ వెల్లడించారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్లవి సిల్వర్ మెడల్ సాధించిందని తెలియజేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శ్రీలేఖ 46–48 కిలోల విభాగంలో, 50–52 కిలోల విభాగంలో సరస్వతి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. 48–50 కిలోల విభాగంలో మంజుల సిల్వర్ మెడల్ సాధించారన్నారు. శ్రీలేఖ, సరస్వతి, మంజుల మానవపాడు రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్నారని చెప్పారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 10వ వార్డు నాగవరం గ్రామానికి చెందిన మంగళి సత్యం కు ఇటీవల ప్రమాదవశాత్తు చెయ్యికి ఫ్యాక్చర్ అయ్యింది. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదివారం సత్యం ను పరామర్శించి, రూ. 5వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్లు జయసుధ, రాధాకృష్ణ, నాయకులు మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన పోగుల నరేష్ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. రావుల పంపించిన రూ.5వేల ఆర్థికసాయాన్ని ఆదివారం స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, శ్యామ్‌సుందర్, వేణుగోపాల్, పరశురాం, మల్లేష్‌యాదవ్, చిన్నకురుమన్న బాధిత కుటుంబానికి మృతుని కుంటుంబానికి అందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూర్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు



అమరచింతలో..

అమరచింత: వనపర్తిలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చంద్రశేఖర్ మెమోరియల్ తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అమరచింత విద్యార్థులు పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించారు. పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు జీవిత, భవ్య, అప్సహరిహా, అనిత, కవిత, శిరీష, లక్ష్మి ఆదివారం జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపర్చారని కరాటే మాస్టర్ పి.నరేందర్ తెలిపారు. విద్యార్థినులకు గోల్డ్‌మెడల్‌తో పాటు సర్టిఫికేట్లను అందించారన్నారు. విద్యార్థినులు కరాటేలో ప్రతిభ కనపర్చి పట్టణ కీర్తిని దేశ నలుమూలల చాటాలని ఆకాంక్షించారు.

ఆత్మకూర్: న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడళ్లు సాధించారు. ఆదివారం వనపర్తిలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్‌హాల్లో జరిగిన చంద్రశేఖర్ మెమోరియల్ తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆత్మకూర్‌కు చెందిన శ్రీవిద్య, శ్రావణి, అరవింద్, గౌరీశంకర్, శశాంక్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటేమాస్టర్ పులి నరేందర్ తెలిపారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబు



ఆత్మకూర్‌లో..



అమరచింతలో విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ఎంబీ కర్మేల్ చర్చి



మూలమళ్లలో..

ఆత్మకూర్: ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఉన్న చర్చిలను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ప్రపంచ శాంతికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు సీజే జర్మియా, విద్యాసాగర్, డేవిడ్, శ్యాంసుందర్, సుమన్ తెలిపారు.

అమరచింత: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. క్రైస్తవులు తమ ఇళ్లపై వెలుతురు చూపే నక్షత్రపు విద్యుత్ దీపాలను అలంకరించి క్రీస్తు రాకను స్వాగతించారు. పట్టణంలోని ఎంబీ కర్మేల్ చర్చిలో పాస్టర్ హ్యాపీపాల్ ఆధ్వర్యంలో క్రీస్తు బోధనలు వినిపించారు.

ఘనంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

పెంట్లవెల్లి: మండలంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయంలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు కలశపూజ, గణపతిపూజ, అభిషేకం, సహస్ర నామార్చన వంటి కార్యక్రమాలు, 11 గంటలకు కల్యాణ మహోత్సవం, ఒంటి గంటకు అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు తోగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు కొప్పుల బాల్‌నారాయణ, సాయివెంకట్, అశోక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.